క్లుప్తంగా

ఉపకార వేతనాలకు విద్యార్థినుల ఎంపిక


ఆర్.సేతుమాధవి


రాణి

ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థినులు ఇద్దరు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. దీని కోసం గతేడాది డిసెంబరులో పరీక్ష రాసి రాజాదుర్గా సేతుమాధవి, బొల్లా రాణి ఎంపికయ్యారు. వీరికి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రతి సంవత్సరం రూ.12 వేలు చొప్పున ఉపకార వేతనం అందిస్తారని ప్రధానోపాధ్యాయుడు వి.ప్రభుదాస్ తెలిపారు.

యోగా శిక్షణ కేంద్రం మార్పు

గుడివాడ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న యోగా శిక్షణా కేంద్రం స్థానిక సత్యనారాయణపురంలోని ఐఎంఏ హాల్లోకి మార్చనున్నట్లు యోగా గురువు కేడీవీ శ్రీనివాస్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మాగంటి శ్రీనివాసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వెనుక గల కైకాల సత్యనారాయణ కళామందిరంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ శనివారం నుంచి ఐఎంఏ హాల్లో జరుగుతుందని పేర్కొన్నారు.

ఐటీఐలో మిగిలిన సీట్లకు ఇంటర్వ్యూలు

గుడివాడ టౌన్: గుడివాడ కేబీఆర్ గవర్నమెంట్ ఐటీఐ, కృష్ణా జిల్లాలో గల ప్రైవేట్ ఐటీఐలలో చేరేందుకు 10 జీపీఏ నుంచి 1.5 జీపీఏ వరకు అడ్మిషన్లు శుక్రవారం వరకు కొనసాగాయని కేబీఆర్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. గౌరీమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా కొన్ని కళాశాలల్లో కొన్ని విభాగాలలో సీట్లు మిగిలిన కారణంగా ఆసక్తి గల విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె సూచించారు. ఈ నెల 9వ తేదీ నుంచి తిరిగి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

ఉర్దూ స్కూల్ హెచ్ఎంగా గౌసియాబేగం

గుడివాడ టౌన్: స్థానిక పాత సంతబజార్ రోడ్‌లోని ఉర్దూ ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా షేక్ గౌసియాబేగం నియమితులైనట్లు గుడివాడ ఎంఈఓ-1 జి. జగన్మోహనరావు, ఎంఈఓ-2 బాలాజీ తెలిపారు. శుక్రవారం గౌసియాబేగంకు ఉద్యోగోన్నతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారులు మాట్లాడుతూ గౌసియాబేగం తొలి మహిళా హెచ్ఎం నియామకమవడం అభినందనీయమన్నారు.

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ నియామకాలు



కైకలూరు: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గ్రామ స్థాయి కమిటీలను నియమిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో పలు కమిటీలను నియమించారు. పార్టీ కార్యాలయంలో పోతుమర్రు, అయ్యవారిరుద్రవరం, అల్లూరు, వడాలి, కాకరవాడ, ఉటుకూరు, చేవూరు గ్రామాలకు గ్రామ కమిటీలను శుక్రవారం నియమించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) నియామక పత్రాలను అందించారు.

బాలికలకు వ్యాయామం అవసరం

గుడ్లవల్లేరు: కిశోర బాలికలకు శారీరక వ్యాయామం అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి సూచించారు. కిశోర వికాసంపై వేసవి శిక్షణ తరగతులను శుక్రవారం అంగలూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో కిశోర బాలికలకు శారీరక వ్యాయామాన్ని పొందవచ్చునని పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీ వరకు నిర్వహించే ఈ కిశోర వేసవి శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని కోరారు.

పోల్‌రాజ్ డ్రెయిన్‌కు మరమ్మతులు

గుడ్లవల్లేరు: విన్నకోటలోని పోల్‌రాజ్ మురుగు కాల్వకు మరమ్మతు పనులను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు పాలేటి ఆంజనేయులు, కోటప్రోలు ఆదినారాయణ, టి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు అందించేందుకు కృషి

కైకలూరు: జిల్లాలో కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించడానికి వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా వ్యవసాయశాఖ జేడీ హబీబ్ బాషా కోరారు. కైకలూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏడీ ఆర్.గంగాధరరావు అధ్యక్షతన సిబ్బందితో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఏఓ ఆర్. దివ్య, వ్యవసాయ క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన వంతెన

ప్రమాదకరంగా ప్రయాణం


శిథిలావస్థకు చేరిన పోలరాజ్ డ్రెయిన్‌పై వంతెన

మండవల్లి: మండలంలోని ప్రత్తిపాడు-తక్కెళ్లపాడు గ్రామాల నడుమ ఉన్న పోలరాజ్ డ్రెయిన్‌పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. సుమారు 45 సంవత్సరాల క్రితం ఈ వంతెన నిర్మాణం జరిగినా అప్పటి నుంచి అధికారులు దీని ఆలనా పాలన చూడకపోవడంతో అస్తవ్యస్తంగా మారింది. వంతెన అడుగు భాగాన ఉన్న ఖానాలు, వంతెన పైభాగం పూర్తిగా దెబ్బతిన్నాయి. ఒక వైపు వంతెన అంచు సైతం విరిగిపోయింది. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్నారు. పోల్‌రాజ్ డ్రెయిన్ పొంగినప్పుడు ఈ వంతెనపై ప్రయాణం చేయాలంటే భయమేస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా డ్రెయిన్ అభివృద్ధి చేయకపోవడంతో వర్షాకాలంలో డ్రెయిన్ పొంగి డ్రెయిన్ సమీప గ్రామాలైన కాకతీయనగర్, పులపర్రు, నుచ్చుమిల్లి, తక్కెళ్లపాడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెనతోపాటు పోల్‌రాజ్ డ్రెయిన్‌ను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


విరిగిన వంతెన చివరి భాగం

పట్టించుకునేవారు లేరు



పోలరాజ్ డ్రెయిన్‌పై వంతెనను 45 సంవత్సరాల క్రితం నిర్మించారు. అప్పటి నుంచి దీని ఆలనా పాలనా చూసిన వారెవ్వరూ లేరు. వర్షాకాలంలో డ్రెయిన్ పొంగితే సమీప గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా డ్రెయిన్‌ను, వంతెనను అభివృద్ధి చేయాలి.

– సీహెచ్ పేతురుబాబు, తక్కెళ్లపాడు

ఇబ్బంది లేకుండా చూడాలి



డ్రెయిన్ అస్తవ్యస్తంగా ఉండటంతో పొంగిన తరుణంలో నీరు గ్రామంలోకి చేరుతుంది. ఏ చిన్న వర్షం కురిసినా డ్రెయిన్ పొంగి సమీప గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. పోల్‌రాజ్ డ్రెయిన్ బాగు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి.

– ఎల్.యేసుదాసు, తక్కెళ్లపాడు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


తోట్లవల్లూరులో విజేతలకు బహుమతులు అందించిన కార్యదర్శి రవికుమార్


గుడివాడలో బహుమతులు సాధించిన చిన్నారులతో గ్రంథాలయ అధికారి శాంతి


ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో బహుమతులు పొందిన విద్యార్థులు

తోట్లవల్లూరు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని తోట్లవల్లూరు పంచాయతీ కార్యదర్శి ఎం.రవికుమార్ అన్నారు. స్థానిక బ్రాంచి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు కార్యదర్శి రవికుమార్ బహుమతులను అందజేశారు. గ్రంథాలయాలను విద్యార్థులు, యువకులు సద్వినియోగం చేసుకుని, ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆయన సూచించారు. గ్రంథాలయాధికారి బాబూరావు, పాండు, తూమాటి సుధాకర్ పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లిలో వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. వేసవి విజ్ఞాన శిబిరాలు తమకు ఎంతగానో ఉపయోగపడ్డాయని విద్యార్థులు పేర్కొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: స్థానిక రాజేంద్రనగర్ లోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ ఏడాది ఏప్రిల్ 28వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ శిక్షణ తరగతులలో విద్యార్థులకు దేశభక్తి గేయాలు, నీతి కథలు, పుస్తక పఠనం, చిత్రలేఖనం, ఆటలు, పాటలు, చదరంగం, క్యారమ్స్ వంటి వాటిలో శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా వారం రోజులుగా నిర్వహించిన పోటీల్లో విజేతలైన చిన్నారులకు బహుమతులు అందజేసినట్లు గ్రంథాలయ అధికారి పి. శాంతి తెలిపారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ముగింపు సభను ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రంథాలయాలు కేవలం పుస్తకాలకు మాత్రమే పరిమితం కాదని ఇవి వ్యక్తుల్లో విజ్ఞానాన్ని పెంచేందుకు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. వేసవిలో విద్యార్థులు శిబిరంలో పాల్గొని జ్ఞానాన్ని ఆశించడం అభినందనీయమన్నారు. శిబిరం నిర్వహించే సమయంలో పలు రకాల ఆటల పోటీలు నిర్వహించగా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, పుస్తకాలు అందజేశారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మండలంలోని అగినపర్రు, మేడూరు, పమిడిముక్కల, పెనుమత్స, కపిలేశ్వరపురం, గురజాడ శాఖా గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. పమిడిముక్కల గ్రంథాలయంలో వివిధ పోటీల్లో విజేతలకు సర్పంచ్ ఎం.సునీత, ఉపసర్పంచ్ ఇమడిబత్తిన వెంకటేశ్వరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు సాలార్ షరీఫ్ పాల్గొన్నారు. కపిలేశ్వరపురంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బి.నాగమణి, వెటర్నరీ డాక్టర్ వెంకటేష్ పాల్గొని వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. గ్రంథపాలకులు వెనిగళ్ల ప్రతాప్ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన నృత్య, ఆట పాటలతో పాటు పుస్తక పఠనం, చిత్ర లేఖనం, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విజేతలకు శుక్రవారం అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాల్లో బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి తదితరులు పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: పుస్తకాల ముందు తలదించుకుని చదివితే.. అవి మనల్ని తల ఎత్తుకునేలా చేస్తాయని జెడ్పీ కోఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధరాజు విద్యార్థులకు సూచించారు. మొవ్వ శాఖా గ్రంథాలయంలో జరిగిన వేసవి విజ్ఞాన తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి పరిశుద్ధరాజు, మండవ కనకయ్య జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం నిమ్మగడ్డ ఉమశ్రీ, నీటి సంఘం అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు మండవ కోటేశ్వరరావు హాజరయ్యారు. అనంతరం పలు పోటీల్ల విజేతలకు బహుమతులు అందజేసినట్లు గ్రంథాలయాధికారి టి.కృష్ణకుమారి తెలిపారు.

కలిదిండిలో..

కలిదిండి(కైకలూరు): కలిదిండి గ్రంథాలయంలో గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం, చెస్ వంటి పోటీలలో విజేతలకు కలిదిండి తహసీల్దారు రామకృష్ణ బహుమతులు అందించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

జమీగొల్వేపల్లి(పామర్రు): చిన్నారులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా మేధో సంపత్తి పొందవచ్చని మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి శాఖ గ్రంథాలయంలో శుక్రవారం వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో యోగా గురువు పొట్లూరి వెంకటధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో..

వేసవి శిక్షణ తరగతుల్లో పలు పోటీల్లో విజేతలైన వారికి ప్రశంసాపత్రాలను శుక్రవారం అందజేశామని గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి పేర్కొన్నారు.


మొవ్వలో బహుమతులు అందజేస్తున్న జెడ్పీ కోఆప్షన్ సభ్యులు


అంగలూరులో విజేతలకు బహుమతుల ప్రదానం

స్మార్ట్ మీటర్లను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం

గుడివాడ టౌన్: విద్యుత్‌కు స్మార్ట్ మీటర్లు బిగించడం పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని సీపీఎం నాయకులు అన్నారు. బలవంతంగా మీటర్లు మారిస్తే వాటిని పగలగొట్టాలని పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మా ఇంటికి స్మార్ట్ మీటర్లు వద్దు అంటూ ముద్రించిన బ్రోచర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రూ.17 వేలు ఖరీదు చేసే మీటర్లను ఇళ్లకు అమర్చి వాటి ఖర్చును అంచలంచెలుగా వినియోగదారుల నుంచి వసూలు చేసేందుకు ప్రభుత్వం కంపెనీలతో అవగాహన కుదుర్చుకుందన్నారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి, వాటిని పగలగొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మీటర్లు బిగించడంలో కూటమి ప్రభుత్వం మరింత దూకుడు పెంచడం దుర్మార్గమన్నారు. తక్షణమే ఈ ప్రయత్నాన్ని విరమించకపోతే దీని వలన కలిగే నష్టాన్ని ప్రజలకు వివరించి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆర్ సీపీ రెడ్డి, నాయకులు మురళీకృష్ణారెడ్డి, సురేంద్ర, పి.రజిని, విజయ్‌కుమార్, ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నైజాం పేటలో నిరసన

గుడివాడ టౌన్: స్థానిక నైజాంపేటలో బలవంతంగా స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని స్థానికులు శుక్రవారం వ్యతిరేకించారు. స్మార్ట్ మీటర్లను రోడ్లపైకి విసిరివేశారు. రూ.17 వేలు ఖరీదు చేసే మీటర్లను తమపై బలవంతంగా రుద్దడం వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్లను పగలగొట్టి తమ నిరసనను తెలియజేశారు. మీటర్లు బిగించడానికి వచ్చిన సిబ్బందిని తరిమివేశారు. కార్యక్రమంలో టిడ్కో అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు నూరున్నీసా, ఉపాధ్యక్షులు నజ్మా, ముస్లిం మైనార్టీ నాయకులు హుస్సేన్, హుమాయూన్, మల్లిక్, షేక్ రేష్మా, అక్బర్ పాల్గొన్నారు.


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు


స్మార్ట్ మీటర్లు పగలగొట్టి నిరసన తెలుపుతున్న నైజాంపేట ప్రజలు

ఘనంగా శివాలయం వార్షిక వేడుకలు

తోట్లవల్లూరు: భద్రిరాజుపాలెంలోని శ్రీఅన్నపూర్ణ సమేత సోమేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. గూడూరు శ్రీనివాస్‌ప్రసాద్ శర్మ, చదలవాడ ఈశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చక స్వామి జగదీష్‌కుమార్ పర్యవేక్షణలో రెండు రోజులుగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు సాగుతున్నాయి. చివరి రోజైన శుక్రవారం స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం జరిగింది. భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చాగంటి విజయలక్ష్మి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ దశమ వార్షికోత్సవాలను శుక్రవారం నుంచి ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు, మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు ఆధ్వర్యంలో వార్షికోత్సవాలను నిర్వహించారు. తొలుత స్వామివార్లకు ఆలయ వ్యవస్థాపకులు సమర్పించిన నూతన వస్త్రాలంకరణ, విశేష నైవేద్యం, అభిషేకం చేపట్టారు. వేడుకల్లో డోకిపర్రు మాజీ సర్పంచ్ పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ తదితరులు పాల్గొన్నారు.

షైనింగ్ అవార్డులకు విద్యార్థుల ఎంపిక

కైకలూరు: పదో తరగతిలో జిల్లా స్థాయి షైనింగ్ స్టార్ అవార్డులకు కైకలూరు నేషనల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ గురజాడ చంద్రమోహన్ శుక్రవారం తెలిపారు. మండలంలో పది పరీక్షల్లో 500కు పైగా మార్కులు సాధించిన వారు ఏడుగురు ఉన్నారని పేర్కొన్నారు. వీరిలో డి.రిశంత్‌రామ్, కె.సంధ్యభవ్య, పీఎస్ఎస్ఆర్ నారాయణమూర్తి, ఎస్.గీతిక నాగదేవి, మరో నలుగురు విద్యార్థులు స్కూల్‌కు చెందిన వారున్నారని తెలిపారు. వీరికి ఈ నెల 9న ఏలూరు సమీపంలోని వట్లూరు సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఒక్కొక్కరికీ రూ.20 వేలు నగదు బహుమతి అందిస్తారని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీల్లో పలువురికి స్థానం

గుడ్లవల్లేరు: వైఎస్సార్ సీపీ గుడ్లవల్లేరు మండల కమిటీలో పలువురు నాయకులకు సముచిత స్థానం ఏర్పడింది. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విడుదల చేసిన నియామకాలు ఈ విధంగా ఉన్నాయి. వైఎస్సార్ సీపీ గుడ్లవల్లేరు మండల కమిటీ వైస్ ప్రెసిడెంట్లుగా మంటాడ చలమయ్య, పార్థి రామ్మోహనరావు, జనరల్ సెక్రటరీలుగా మేడేపల్లి రవికుమార్, కొడాలి శివకుమార్, ఎస్కే మీరావలీ, యార్లగడ్డ వెంకటేశ్వరరావుతోపాటు ఐదుగురు సెక్రటరీలు, 11 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లను నియమించారు.

గుడివాడలో..

గుడివాడ రూరల్ : వైఎస్సార్ సీపీ గుడివాడ మండల కమిటీలో పలువురు నాయకులకు సముచిత స్థానం ఏర్పడింది. శుక్రవారం వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన నియామకాలు ఈ విధంగా ఉన్నాయి. వైఎస్సార్ సీపీ గుడివాడ మండల కమిటీ వైస్ ప్రెసిడెంట్లుగా ఏలేటి ఆంజనేయులు, గుడివాడ రవిబాబు, జనరల్ సెక్రటరీలుగా జక్కా రమేష్, కళ్లా అశోక్‌బాబు, అంగడాల శివకుమార్, చేదుర్తిపాటి వినోద్‌కుమార్‌తో పాటు ఐదుగురు సెక్రటరీలు, 20 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు.

పామర్రు నియోజకవర్గంలో..

పామర్రు: పామర్రు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన మండల స్థాయి నాయకులను వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నాయకుల వివరాలను కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటించింది.

పామర్రులో..

పామర్రు మండల వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షులుగా పుట్టి కిషోర్, కాకి ప్రసాద్, ప్రధాన కార్యదర్శులుగా పెయ్యలరాజు, గుజవర్తి రవికాంత్‌రెడ్డి, కొడాలి సురేష్, బడుగు నాగరాజుతోపాటు ముగ్గురు సెక్రటరీలు, 24 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లను నియమించారు.

మొవ్వలో..

మొవ్వ మండల వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షులుగా కొడమంచిలి నాంచారయ్య, పుట్టి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా చిన్నం రత్నాబాయి, కాటూరి శ్రీకాంత్, కుక్కల హరిష్, ఏనుగ మోహన్‌రావుతో పాటు నలుగురు సెక్రటరీలు, ఎగ్జికూటివ్ మెంబర్లుగా 21 మందిని ఎంపిక చేశారు.

తోట్లవల్లూరులో..

మండల ఉపాధ్యక్షులుగా పీఎస్ కోటేశ్వరరావు, బత్తిన సోమేశ్వరరావు ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా బడుగు శంకర్, సోలే ధర్మయ్య, ఆరేపల్లి శ్రీనివాసరావు, మండిపూడి శివరామిరెడ్డితోపాటు ఐదుగురు సెక్రటరీలు, 16 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగానియమించారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షులుగా పాతూరి చంద్రపాల్, బొల్లా సాంబశివరావు, ప్రధాన కార్యదర్శులుగా గరికపూడి మల్లికార్జునరావు, కోడెబోయిన కోటేశ్వరరావు, కనుమూరి వెంకటేశ్వరరావు, షేక్ హిదయతుల్లాతో పాటుగా ఐదుగురు సెక్రటరీలు, 25 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి వైఎస్సార్ సీపీ మండలంలో ఉపాధ్యక్షులుగా రెమల్లి సువర్ణరాజు, పునుకొల్లు శివ రామప్రసాద్, ప్రధాన కార్యదర్శులుగా పేటేటి ఆదియ్య, తోట యామిని, కలుగూరి వెంకటేశ్వర్లు, నాగుళ్ల శ్రీనివాసరావు, కార్యదర్శులుగా శైల వెంకటేశ్వరమ్మ, మాగంటి లోకేశ్వరరావు, పల్లి అనీల్, గొల్లా వెంకటేశ్వరరావులుతో పాటుగా ఐదుగురు సెక్రటరీలు, 20 మంది నాయకులను ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు.

నేల ఆరోగ్యానికి యాజమాన్య పద్ధతులు పాటించాలి


రైతులనుద్దేశించి మాట్లాడుతున్న కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త కృష్ణవేణి

జుఝువరం(పామర్రు): నేల ఆరోగ్యంగా ఉండటానికి పోషక యాజమాన్య పద్ధతులను అనుసరిస్తే వరి సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని ఘంటసాల కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జీ కృష్ణవేణి పేర్కొన్నారు. మండలంలోని జుఝువరం సచివాలయం వద్ద వికసిత కృషి సంకల్ప అభియాన్ అనే అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ వెద జల్లే పద్ధతిలో సాగు చేస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. వరిలో నూతన వంగడాలు, వివిధ నేలలకు అనువైన పరికరాల గురించి వాటిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించామన్నారు. భూసార పరీక్షల ప్రాముఖ్యత పచ్చిరొట్ట పైరు ఉపయోగాలను వివరించామన్నారు. ప్రస్తుత కాలంలో అధిక మోతాదులో రసాయన మందుల వినియోగించడం ద్వారా నేల కలుషితమవుతోందన్నారు. భూ సారాన్ని కాపాడుకోవడానికి పచ్చిరొట్ట ఎరువుల వినియోగం చేపట్టాలని పేర్కొన్నారు. విశ్రాంత వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ రోశయ్య, ఘంటసాల వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సత్యప్రియ లలిత, పామర్రు ఏడీఏ బి.స్వర్ణలత, ఏఓ శివ నాగ రాణి, వేదగిరి భారతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం డాక్టర్ సుబ్బన్న, కేవీకే ఘంటసాల సస్యపోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం


రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి కిట్టును అభినందిస్తున్న డీఎన్నార్

కైకలూరు: వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా క్షేత్ర స్థాయిలో ప్రతి కార్యకర్త పనిచేయాలని పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. ఇటీవల రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా నియమితులైన కలిదిండి మండలానికి చెందిన గాదిరాజు వెంకటకిషోర్ మణికంఠ వర్మ (కిట్టు)ను కైకలూరు పార్టీ కార్యాలయంలో శుక్రవారం సన్మానించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్‌కు కిట్టు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ ముదిరాజ్‌ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్‌రావు, పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగ సెక్రటరీ, ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గండికోట ఏసుబాబు, నాయకుడు జాన్ విక్టర్ పాల్గొన్నారు.